క్లుప్తంగా

ఇత్తడి నేమ్ ప్లేట్ల వితరణ



చిల్పూరు : చిల్పూరు బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయానికి మండలంలోని నెల్లుట్లకు చెందిన దోర్నాల మనోహర్‌స్వామి–అండాల్, కడవేర్లు రవీందర్–రమాదేవి దంపతులు రూ.20వేల విలువైన ఇత్తడి నేమ్‌ప్లేట్లను బుధవారం అందజేశారు. శ్రీదేవి, భూదేవి పేర్లతో ఉన్న ఇత్తడి ప్లేట్లను ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ శ్రీధర్‌రావుకు అందించారు.

పౌష్టికాహారం అందించాలి



బచ్చన్నపేట : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అర్హులకు పౌష్టికాహారాన్ని అందించాలని మండలంలోని కొడవటూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి బృంగి రూపాచైతన్య టీచర్లకు సూచించారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గుడ్లు, ఆహార పదార్థాలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పిల్లలను అందరిని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని, ముఖ్యంగా పిల్లల సంఖ్య పెరిగేలా చూడాలని అన్నారు. రికార్డుల నిర్వాహణ సక్రమంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, చిన్నారులు పాల్గొన్నారు.

వంట సామగ్రి అందజేత



జఫర్‌గఢ్ : మండలంలోని కోనాయిచలం గ్రామంలో ఇటీవల షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు కాలిపోయి నిరాశ్రయులైన జోగు బాబు కుటుంబానికి తిడుగు గ్రామానికి చెందిన అంకేశ్వరపు హరిప్రసాద్, రంగు సురేష్‌లు బుధవారం వంట సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో రడపాక భాస్కర్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం

లింగాలఘణపురం : మండలంలోని జీడికల్ చెరువులో గోదావరి జలాలు చేరడంతో బుధవారం మాజీ జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఎంతో పట్టుదలతో మండలంలోని చివరి గ్రామమైన జీడికల్ వరకు గోదావరి జలాలను తీసుకొచ్చి చెరువులు, కుంటలు నింపుతున్నాడని వంశీధర్‌రెడ్డి ఎమ్మెల్యే సేవలను కొనియాడారు. కార్యక్రమంలో శివకుమార్, మూర్తి, దిలీప్‌రెడ్డి, ప్రవీణ్, మోహన్, సంపత్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నిక



రవిగౌడ్

పాలకుర్తి టౌన్ : సోమేశ్వర ఆటో యూనియన్ మండల అధ్యక్షుడిగా తొర్రూరు గ్రామానికి చెందిన గిరగాని రవిగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం మండలంలోని తొర్రూరు దుర్గామాత ఆలయం ఆవరణంలో ఆటో యూనియన్ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కసిరబోయిన నరేష్, కార్యదర్శిగా చిదురాల కృష్ణమూర్తి, కోశాధికారిగా పసులాది శంకర్ ఎన్నికయ్యారు.

ఉద్యమకారులను గుర్తించాలి

పాలకుర్తి టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించాలని తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్ష వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గోధుమల కుమారస్వామి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పంచగుల్లు ఆవరణంలో ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు మూల ప్రభాకర్ అధ్యతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడారు. సమావేశంలో దండయ్య, సోమయ్య, మహేదర్‌రాజు, యాకన్న, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు కంటి వైద్యశిబిరం

చిల్పూరు : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో నేడు(గురువారం) రెవెన్యూ సర్వీస్ అండ్ అసోసియేషన్, వాసం ఐ కేర్ హనుమకొండ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు టీజీఆర్ఎస్ఏ జిల్లా జనరల్ సెక్రటరీ, చిల్పూరు డీటీ మందడపు రామారావు, ప్రతినిధి ఆర్ఐ చీకటి వినీత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

రేపు వాహనాల వేలం

పాలకుర్తి టౌన్ : వివిధ కేసుల్లో పట్టుబడిన నాలుగు ద్విచక్ర వాహనాలను ఈనెల 7న (శుక్రవారం) ఉదయం పాలకుర్తి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌లో వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ సంతోష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు వేలం పాటలో పాల్గొన్నాలని పేర్కొన్నారు.

ప్రకృతి వనాలను పట్టించుకోరూ?

నిర్మించారు.. నిర్వహణ మరిచారు
- బోర్డులకే పరిమితమైన వైనం

చిల్పూరు : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆహ్లాదం కోసం గ్రామానికో పల్లెప్రకృతి వనాన్ని ఏర్పాటు చేసింది. అయితే ప్రకృతి వనాల్లో స్థానికులు సేదదీరడంతో పాటు ఆహ్లాదాన్ని పంచాలన్న ఉద్దేశంతో నిర్మించారు. ప్రస్తుతం వాటి నిర్వహణ భారంగా మారడంతో అనేక గ్రామాల్లో ప్రకృతి వనాలు బోర్డులకే పరిమితమయ్యాయి. గతంలో పచ్చదనంతో నిండి ఉండడంతో సాయంత్రం కాగానే ఆయా గ్రామాల ప్రజలు కాసేపు విశ్రాంతి తీసుకునే వారు. నేడు నిర్వహణ లేకపోవడంతో మొక్కలు ఎండిపోయి కళావిహీనంగా మారాయి. దీంతో అందులో అడుగు పెట్టే వారు కరువయ్యారు.



చిల్పూరులోని పల్లెప్రకృతి వనం

అధ్వానంగా నిర్వహణ..

మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన ప్రకృతి వనాల నిర్వహణ అధ్వానంగా మారింది. పువ్వులు, పండ్లు, ఇతర మొక్కలను పెంచి ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేసే ఉద్దేశంతో నెలకొల్పగా వాటిని అధికారులు పట్టించుకోవడం లేదు. పల్లె ప్రకృతి వనాలకు అప్పటి ప్రభుత్వం లక్షల్లో ఖర్చు చేసింది. ఈ వనాలు గ్రామ పంచాయతీ రికార్డుల్లో కనిపిస్తున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం మైదానాలుగా మారిపోయాయి. గ్రామ పంచాయతీల్లో నిధులు లేమి కారణంగా నిర్వహణ భారంగా మారిందని అధికారులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పల్లెప్రకృతి వనాల నిర్వహణను చేపట్టాలని కోరుతున్నారు.



ప్రకృతి వనంలో ఎండిపోతున్న మొక్కలు

వినియోగంలోకి తేవాలి



మండలంలోని అనేక గ్రామాల్లో ప్రకృతి వనాల్లో ఇంకా పచ్చని చెట్లు ఉన్నాయి. ఎండిపోయిన మొక్కలు తొలగించి వేరే వాటిని ఏర్పాటు చేసి ప్రజలకు వినియోగంలోకి తేవాలి. ఈ విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

– ఉద్దెమారి రాజ్‌కుమార్, మాజీ సర్పంచ్ చిల్పూరు

ప్రత్యేక నిధులు లేవు



ప్రకృతి వనాల సంరక్షణకు ప్రత్యేక నిధులంటూ ప్రభుత్వం ఇవ్వలేదు. జీపీల నుంచి ఖర్చు చేయాలన్నా నిధుల లేమి ఉంది. అయినా ఏదో ఒక విధంగా వనాలను పరిశీలించి నిర్వహణకు చర్యలు తీసుకుంటాం.

– బర్మావత్ శంకర్ నాయక్, ఎంపీడీఓ

ప్రాధాన్య అంశాలను సాధన చేయాలి



తరిగొప్పుల: సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, పక్కన అధికారులు

- విద్యార్థులు ఉన్నతశ్రేణిలో ఉత్తీర్ణులవ్వాలి
- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

తరిగొప్పుల : పదో తరగతి వార్షిక పరీక్షలకు 15 రోజులు మాత్రమే మిగిలి ఉందని, ప్రతీ విద్యార్థి ఉన్నతశ్రేణిలో ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా సూచించారు. మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ నెల్లుట్ల జానకి అధ్యక్షతన బుధవారం విజయోస్తులో భాగంగా మండల స్థాయి ప్రేరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ప్రాధాన్యత కలిగిన అంశాలపై సాధన చేయాలన్నారు. ఏదైనా సబ్జెక్ట్‌లో వెనకబడిన విద్యార్థులు ఈ 15 రోజుల వ్యవధిలో మరింత కష్టపడితే తప్పకుండా ఉత్తీర్ణులవుతారని పేర్కొన్నారు. నేటి నుంచి జరిగే ప్రీఫైనల్ పరీక్షలకు సన్నద్ధమవ్వాలని తెలిపారు. సమయాన్ని అస్సలు వృథా చేయొద్దని, పరీక్షలో ప్రతీ ప్రశ్నకు సమాధానం రాయాలన్నారు. ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పంచ సూత్రాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. సమయానుకూలంగా నిద్రపోవడం, చదువు, ఆరోగ్యం చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఓ రమేష్, ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి, జీడీసీఓ గౌసియా బేగం, ఏఎంఓ శ్రీనివాస్, హెచ్ఎం బానోత్ రవీందర్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

జనగామ : వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం -2007కు సంబంధించిన అవగాహన పోస్టర్‌ను టాస్కా (తెలంగాణ స్టేట్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వయోవృద్ధులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను జనగామ టాస్కాతో సమన్వయం చేసుకోవాలన్నారు. పోస్టర్‌ను రెవెన్యూ డివిజన్ కేంద్రంతో పాటు అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించాలని సూచించారు. టాస్కా రాష్ట్ర అధ్యక్షుడు పి.నర్సింహరావు, కోశాధికారి రాంనాథ్, డాక్టర్ జ్ఞానేశ్వర్‌రావు, జిల్లా అధ్యక్షుడు సిద్దిమల్లయ్య, కార్యదర్శి తాళ్ల వెంకటమల్లారెడ్డి, రమేష్, ప్రభాకర్‌రావు, మహేశ్వర్, మహేందర్‌రెడ్డి, హరిబాబు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిర్మూలించాలి



జనగామ రూరల్ : గ్లోబల్ ఫౌండేషన్ ద్వారా పెంబర్తిలో నిర్వహిస్తున్న బాల సంస్కార్ కేంద్రాన్ని ఆ ఫౌండేషన్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ పూస్కూరి సోమేశ్వర్ రావు బుధవారం సందర్శించారు. ప్లాస్టిక్ నిర్మూలన లక్ష్యంగా చేపడుతున్న కార్యక్రమంలో భాగంగా వివేకానంద సేవా సమితి ద్వారా జూట్ బ్యాగులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువుతోపాటు క్రమశిక్షణ, సంస్కారం, మానవత విలువలను తెలుసుకోవాలన్నారు. విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్సిల్, ఇతర కిట్స్ అందజేశారు. ఉపాధ్యాయులు కావ్యశ్రీ, వలంటీర్ మధు, వెంకన్న, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

చిల్పూరు : చిన్నపెండ్యాల సమీపంలోని జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు కాగా ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ కథనం ప్రకారం.. ఘన్‌పూర్‌కు చెందిన గడ్డం రవి, కుటుంబ సభ్యులు పని నిమిత్తం ఆటోలో హనుమకొండకు వెళ్తున్నారు. చిన్నపెండ్యాల దాటిన తర్వాత అతివేగంగా వచ్చిన కారు వెనుక నుంచి ఆటోను ఢీకొట్టి వెళ్లిపోయింది.ఈ ప్రమాదంలో ఘన్‌పూర్‌కు చెందిన గడ్డం రవికి తీవ్రగాయాలు కాగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

పశు వైద్యశిబిరాలను వినియోగించుకోవాలి



రైతులకు మందులు అందజేస్తున్న వైద్యాధికారి

జఫర్‌గఢ్ : పశువైద్య శిబిరాలను రైతులు వినియోగించుకోవాలని ఉప్పుగల్లు పశువైద్యాధికారి శ్రీనాథ్ కోరారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామంలో బుధవారం పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కృత్రిమ గర్భధారణ ద్వారా ఆడదూడలు పొందవచ్చన్నారు. అనంతరం 66 పశువులు, దూడలకు నట్టల నివారణ మందులతో పాటు దూడలకు కృత్రిమ గర్భధారణ కార్యక్రమం నిర్వహించారు. వైద్యసిబ్బంది ఎంపటి రాజేశ్వర్‌రావు, మంజుల, గోపాలమిత్రలు గుజ్జరి రాజు, చిలువేరు నగేష్, రమణాచారి, సంపత్, గోపాల్, రజిత తదితరులు పాల్గొన్నారు.

10న బీరప్ప-కామరాతి కల్యాణ వేడుకలు

- ఉత్సవాలకు ఆలయాల ముస్తాబు

బచ్చన్నపేట : మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో బీరప్ప–కామరాతి కల్యాణం పెద్ద పండుగను నిర్వహిస్తున్నట్లు బీరప్ప గొల్లకురుమ సంఘం నాయకులు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ వారం రోజులు సాగే ఉత్సవాలకు ఆలయాలను ముస్తాబు చేశామన్నారు. 10వ తేదీన బీరప్ప కామరాతి కల్యాణవేడుక నిర్వహిస్తామని, బయ్యన్న పూజతో ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు.

మాజీ కార్యదర్శి పేరుతో వెలిసిన ఫ్లెక్సీ

- అవినీతి, అక్రమాల వెల్లడి

స్టేషన్‌ఘన్‌పూర్: శివునిపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా 2023లో పనిచేసి ఏసీబీకి పట్టుబడిన కుర్ర చిరంజీవిపై స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి గ్రామాల్లో బుధవారం ఫ్లెక్సీలు వెలిశాయి. 2014 నుంచి 2023 వరకు జేపీఎస్, పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన చిరంజీవి పలువురు ఎంపీడీఓలు, ఎంపీఓలు, కార్యదర్శులను బ్లాక్ మేయిల్ చేశాడు.. ఎంతోమంది ఉద్యోగులను ఆర్‌టీఐ ఆకాశ రామన్న పేరుతో లెటర్లు సృష్టించి బ్లాక్ మేయిల్‌చేసి రూ.2 కోట్లు అవినీతికి పాల్పడ్డాడు.. అందరి ఉసురు తగిన ఏసీబీకి పట్టుబడ్డాడని ఫ్లెక్సీల్లో పేర్కొన్నారు. శివునిపల్లి కార్యదర్శి శ్రీకాంత్ జీపీ నిధులు రూ.30 లక్షలు దుర్వినియోగం చేశాడని మాజీ కార్యదర్శి భార్య ఉమారాణి కలెక్టర్‌కు, డీపీఓకు ఇటీవల ఫిర్యాదు చేయగా బుధవారం డీఎల్‌పీఓ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఫ్లెక్సీలు ఏర్పాటు కావడం చర్చనీయాంశంగా మారింది.



కుర్ర చిరంజీవి అవినీతిపై వెలిసిన ఫ్లెక్సీ

కాల్వ పూడికతీత పనులు

పాలకుర్తి టౌన్ : పాలకుర్తి, దేవరుప్పుల, కొడకండ్ల మండలాల రైతులకు దేవాదుల సాగునీరు అందించేందుకు ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి ఆదేశాలతో నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమండ్ల ఝాన్సీరెడ్డి బుధవారం పనులు చేపట్టారు. స్టేషన్ ఘన్‌పూర్ మండలంలోని బోయినిగూడెం 4ఎల్ కెనాల్ నుంచి పాలకుర్తి, దేవరుప్పుల మండలంలోని ధర్మపురం వరకు సాగునీరు అందించేందుకు సొంత ఖర్చులతో కాల్వలో పేరుకుపోయిన పూడిక తీత పనులు చేపట్టారు.

సాగునీరు అందించడంలో 'కడియం' విఫలం

- మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

రఘునాథపల్లి : పంటలకు సాగునీరు అందించడంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి విఫలమయ్యారని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంటలు ఎండుతున్నా సాగునీటిపై సమీక్షలు నిర్వహించకుండా వ్యక్తిగత ప్రయోజనాల కోసం కడియం పాకులాడుతున్నాడని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి తప్పా.. ఎమ్మెల్యే, తన కూతురు ఎంపీ ద్వారా జరిగిన అభివృద్ధి ఏం లేదని ధ్వజమెత్తారు. రాజ్యాంగ విలువలు ఉంటే కడియం శ్రీహరి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్ నుంచి పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపు నిచ్చారు. సమావేశంలో మాజీ ఎంపీపీ కుమార్‌గౌడ్, మారపాక రవి, బానోత్ శారద, విజయ్, నాగరాజు, శ్రీనివాస్, కిరణ్, పర్షరాములు, హరీష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తాటికొండ రాజయ్య

కోతలు లేకుండా విద్యుత్ సరఫరా

- డీఈ లక్ష్మీనారాయణరెడ్డి

జనగామ : వేసవి దృష్ట్యా జనగామ పట్టణంలో గృహ, వాణిజ్య వినియోగదారులకు కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు సమ్మర్ యాక్షన్ ప్లాన్‌ను అమలు చేస్తున్నట్లు డివిజన్ ఇంజనీర్ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. బుధవారం టౌన్–1 సెక్షన్ పరిధిలోని 21వ వార్డులో 100 కేవీ, 10వ వార్డులో 63 కేవీ రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు.వేసవిలో సాంకేతిక సమస్యలు ఉత్పన్నం కాకుండా, నిరంతరాయ విద్యుత్ సరఫరాకు ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ వేణుగోపాల్, ఏఈ సామ, సబ్ ఇంజనీర్ మనోహర్, వీరాంజనేయులు ఫోర్‌మెన్, రవీందర్, ఎస్ఎల్ఐ రాంబాబు, ఎల్ఐలు రవీందర్‌రెడ్డి, ప్రసాద్, ఎల్ఎం రాజు, ఏఎల్ఎంలు రమేష్, విజయ్ ఉన్నారు.



జనగామ: ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సిబ్బంది, అధికారులు

మెరుగైన విద్యుత్ సరఫరాకు..

దేవరుప్పుల : వేసవి కాలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా చర్యలు చేపడుతున్న విద్యుత్ శాఖ ఎస్ఈ వేణుమాధవ్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని నీర్మాల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో భాగంగా లైన్‌ను మరమ్మతు పనులు చేపట్టారు. . ఈ కొత్త ఇంటర్ లింకింగ్ లైన్ వేయడం ద్వారా నిర్మాలకు అంతరాయం లేకుండా సరఫరా ఇవ్వడం జరుగుతుందన్నారు.

సైబర్ నేరాలతో జాగ్రత్తగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ మహేందర్ రెడ్డి

- సీఐ మహేందర్ రెడ్డి

పాలకుర్తి : సైబర్ నేరాలతో విద్యార్థులు, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సీఐ మహేందర్ రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని గూడూరు తెలంగాణ గిరిజన బాలికల విద్యాలయంలో 'సైబర్ జాగృతిక దివస్'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలపై విద్యార్థులు తమ తల్లిదండ్రులకు వివరించాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎస్సై పవన్‌కుమార్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

జఫర్‌గఢ్ : పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీకాంత్ కోరారు. స్థానిక మోడల్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలన్నారు.అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు రమేష్, శ్రీనివాస్, ఎల్లస్వామి, బాలమురళికృష్ణ, సరిత, వేణుగోపాల్‌రెడ్డి, యాకాంతం, రాధిక, అనిత, బాలకృష్ణ, ప్రశాంతి పాల్గొన్నారు.



జనగామ: వార్షికోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

మోడల్ స్కూల్ వార్షికోత్సవం

జనగామ రూరల్ : మండలంలోని చౌడారం ఆదర్శ పాఠశాలలో వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ కె.సుధీర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉత్తమ ఫలితాల లక్ష్యంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి.

చంద్రయ్య మృతి పార్టీకి తీరని లోటు

- సీపీఐ జిల్లా కార్యదర్శి రాజారెడ్డి

జనగామ రూరల్ : గ్రేన్ మార్కెట్ హమాలీ యూనియన్ వ్యవస్థాపకుడు కందికొండ చంద్రయ్య మృతి సీపీఐకి తీరని లోటు అని సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ రాజారెడ్డి అన్నారు. బుధవారం చంద్రయ్య మృతి చెందగా ఆయన మృతదేహానికి పూలమాల వేసి ఎర్రజెండాతో నివాళులర్పించారు. పట్టణ కమిటీలో సీపీఐ నిర్మాణానికి ప్రత్యేక శ్రద్ధ వహించారని గుర్తు చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న, పట్టణ కార్యదర్శి చొప్పరి సోమయ్య, చింతకింది అరుణ, మోటె శ్రీశైలం, చామకూర యాకూబ్, భూమళ్ల ఐలయ్య, బుడిగె వీరస్వామి, తిప్పరబోయిన సిద్ధులు, రాజు, తిరుమలేష్, ఐలయ్య, యాదగిరి ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నర్మెట : మండలంలోని మచ్చుపహాడ్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నాగపురి గట్టయ్య అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతిచెందాడు. ఓబీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి యాదయ్య బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. నాయకులు గొల్లపల్లి కుమారస్వామి, భూక్య జయరాం, అంజయ్య, లింగరాజు, బుర్రా రాజు, నరేష్, లక్ష్మినారాయణ, సాయన్న, ప్రసాద్, బుచ్చయ్య, చంద్రయ్య, నిఖిల్, యాదగిరి తదితరులు ఉన్నారు.

పాలకుర్తి : మండలంలోని రాఘవాపురం, లక్ష్మీనారాయణపురం, అయ్యంగారిపల్లి, ఎల్లమ్మగడ్డ తండా, హట్యా తండాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి పరామర్శించారు. రాపాక సత్యనారాయణ, కుమారస్వామి పాల్గొన్నారు.



నర్మెట: నివాళులర్పిస్తున్న నాయకులు

ఘనంగా స్వయం పాలన దినోత్సవం



రఘునాథపల్లి: వెల్ది ప్రాథమిక పాఠశాలలో..



జఫర్‌గఢ్: హిమ్మత్‌నగర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

రఘునాథపల్లి : మండలంలోని వెల్ది ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. బి.అజయ్‌కుమార్ హెచ్ఎంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థులు నిజజీవితంలో కూడా ఉన్నతమైన స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.రమాదేవి, టి.సారయ్య, శారదతో పాటు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

జఫర్‌గఢ్ : మండలంలోని హిమ్మత్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయం పాలన దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు బోధన చేశారు. ప్రధానోపాధ్యాయుడిగా శవనబోయిన నవీన్, రీజనల్ జాయింట్ డైరెక్టర్‌గా స్వాతిక, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్‌గా తాటికాయల యశంత్ వ్యవహరించారు. ఈ సందర్భంగా ఉత్తమ విద్యాబోధన చేసిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మంగు జయప్రకాశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాజిరి..జాజిరి

- పల్లెల్లో కాముడి కోలాటం

దేవరుప్పుల : హోలీ పండుగ పురస్కరించుకొని పల్లెల్లో కాముడి కోలాటం సందడి మొదలైంది. ఇంటింటా చిన్నారులు తిరుగుతూ తమదైన శైలిలో జాజిరి..జాజిరి ఆడుతున్నారు. బుధవారం మండలంలోని కడవెండిలో చిన్నారులు హోయి హోయి రామిరెడ్డి..పదహారు ఎడ్ల బండి కట్టి అంటూ చిన్నారులు కోలలతోపాటు ఇనుప డబ్బా డప్పుచప్పుళ్లతో ఇంటింటా తిరుగుతూ ఇనామ్ వసూళ్లు చేయడంతో పూర్వపు కాముడి పల్లె కోలాటం ఆటకు అద్దం పడుతోంది.



కడవెండిలో కోలాటం ఆడుతున్న చిన్నారులు